గీతా జయంతిని జయప్రదం చేయాలి

చింతల్: గీతా జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు భగత్‌సింగ్‌నగర్ ధర్మశాస్త్ర సేవా సమితి అధ్యక్షుడు భునేటి రవీందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గీతా జయంతి అనగా భగవద్గీతను బోధించిన రోజు అని పేర్కొన్నారు. డిసెంబర్ 23 ఉదయం 8గంటలకు శ్రీకృష్ణ భగవానుల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు 108 మందితో భగవద్గీత పారాయణం నిర్వహించనున్నట్లు తెలిపారు. హిందూ బంధువులందరూ పెద్ద ఎత్తున పాల్గొని గీతా జయంతిని జయప్రదం చేయాలని కోరారు. ఆసక్తి గలవారు ఈనెల 21లోపల తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లోని శ్రీవీరాంజనేయ స్వామి దేవాలయం హరిహర క్షేత్ర ఆవరణలో జరుగనుందని తెలిపారు. వివరాలకు ఫోన్ నం .9059663440, 9949236133లో సంప్రదించాలని కోరారు.

పంచలోహ 18 మెట్లకు రూ.లక్ష విరాళం



నిజాంపేట్: నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధి శ్రీనివాసనగర్ కాలనీలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు చిట్ల దివాకర్, రజిత రవికాంత్‌లు అయ్యప్ప మాలాధారులకు భిక్ష ఏర్పాటు చేశారు. అదే విధంగా ఆలయంలో ఏర్పాటు చేయనున్న పంచలోహ 18 మెట్లకు తమ వంతు సహాయంగా రూ.లక్ష అందజేశారు. ఆలయ చైర్మన్ కొలన్ చంద్రశేఖర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ధనరాజ్‌యాదవ్, రవికాంత్, ఆలయ కమిటీ సభ్యులు ఉంగరాల శ్రీనివాస్, నల్లాది హరి, దీక్ష దారులు తదితరులు ఉన్నారు.



400 అక్రమ నిర్మాణాల కూల్చివేత

తెల్లవారుజామున ఏక కాలంలో భారీగా కూల్చివేతలు

బాలానగర్ ఏసీపీ గంగారాం పర్యవేక్షణలో భారీ భద్రత

సుభాష్‌నగర్: గాజులరామారం ప్రభుత్వ స్థలంలో వెలిసిన నిర్మాణాలను పోలీసు భద్రత మధ్య రెవెన్యూ అధికారులు పెద్ద ఎత్తున కూల్చివేతలు చేపట్టారు. గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్, దేవేందర్‌నగర్ ప్రభుత్వ స్థలాల్లో వెలిసిన నిర్మాణాలపై నవంబర్ 20న 'ఇదే తరుణం.. కబ్జా చేద్దాం'.. డిసెంబర్ 15న 'ప్రభుత్వ స్థలం 300 ఇళ్లతో బస్తీ నిర్మాణం'అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనాలపై మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం స్పందించారు.

- ఈనెల 15న గాజులరామారంలోని సర్వే నంబర్లు 329, 342, 307లో జరుగుతున్న కబ్జాలపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మల్కాజ్‌గిరి ఆర్డీఓ షాంప్రకాష్ నేతృత్వంలో శనివారం తెల్లవారుజామున బాలానగర్ ఏసీపీ గంగారాం పర్యవేక్షణలో 200 మంది పోలీసు భద్రత మధ్య ఆరు బృందాలుగా ఏర్పడి ఏకకాలంలోనే కూల్చివేతలు చేపట్టారు.
- సర్వే నం.307 బాలయ్య నగర్, గాలి పోచమ్మ బస్తీ, 329 వాటర్ ట్యాంక్, 342 మంజూరు నగర్, హనుమాన్ టెంపుల్ ఎదురుగా వెలిసిన నిర్మాణాలను పెద్ద ఎత్తున కూల్చివేశారు. సుమారు 400 నిర్మాణాలను నేలమట్టం చేశారు.

ముందస్తుగా అదుపులోకి...

శుక్రవారం సాయంత్రమే స్థానికంగా ఉన్న కొంతమంది కబ్జారాయుళ్లను జగద్గిరిగుట్ట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న మరికొంత కబ్జారాయుళ్లు పరారయ్యారు. దీంతో నిర్మాణాలను అధికారులు సులువుగా కూల్చివేశారు.



గాజులరామారం సర్వే నం.342లో అక్రమ గదులను కూల్చివేసిన దృశ్యం..

ఆహాకారాలు.. రోదనలు..

కూల్చివేతల సమయంలో మహిళలు, చిన్నపిల్లలు రోదనలు మిన్నంటాయి. కాయ కష్టం చేసి పైసా పైసా కూడబెట్టి తాము కట్టుకున్న ఇళ్లను కూల్చవద్దని అధికారులు కాళ్లపై పడి వేడుకున్నారు. మరి కొంతమంది గదుల్లో ఉండే తలుపులు వేసుకున్నారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి వారిని బయటకు పంపించేసి నిర్మాణాలను నేలమట్టం చేశారు.

హిజ్రాల హల్‌చల్..

సర్వే నం.342లో ఇళ్లను కూల్చివేసేందుకు వెళ్లగా స్థానికంగా ఉన్న హిజ్రాలు హల్‌చల్ చేశారు. తమ ఇళ్లను కూల్చితే ఊరుకునేది లేదని ఒకరు ఒంటిపై డిజిల్ పోసుకోగా పోలీసులు అడ్డుకున్నారు. చేసేదేమీ లేక 6 గదులను వదిలేశారు.



మల్లేశా మజాకా.. అతడి నిర్మాణాలు పదిలం.!

సర్వేనం.342లో నిర్మాణాలకు సూత్రధారుడైన అయిన మల్లేష్ అతను వారం రోజుల వ్యవధిలో చేపట్టిన 20 నిర్మాణాలను కూల్చకుండా వదిలేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. శుక్రవారం జగద్గిరిగుట్ట పోలీసులు కబ్జారాయుళ్లను అదుపులోకి తీసుకోగా, మల్లేష్ ఒక్కడినే వదిలేయడం కొసమెరుపు. ఇక మల్లేష్ సారథ్యంలో వెలిసిన నిర్మాణాలను అధికారులు కూల్చివేతలు చేపడతారో.. వదిలేస్తారో వేచి చూడాలి.

కబ్జాలపై పంజా విసిరిన తహసీల్దార్ రెహమాన్..

రెండు నెలల క్రితం ఇక్కడికి బదిలీపై వచ్చిన తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్ ఖాన్ కేవలం ఒక్కరోజు మాత్రమే కార్యాలయంలో విధులు నిర్వర్తించారు. రెండు నెలల పాటు సర్కిల్ కార్యాలయంలో ఎన్నికల పనులపై నిమగ్నమయ్యారు. ఎన్నికల పనుల నుంచి వైదొలిగిన తర్వాత ఒక్క రోజులోనే వందల కూల్చివేతలు చేపట్టడంపై కబ్జారాయుళ్లు కంగుతున్నారు.



పోలీసుల పహారా మధ్య కూల్చివేతలు చేపడుతున్న దృశ్యం



గాజులరామారం సర్వే నం. 342లో పోలీసుల బందోబస్తు

ఎమ్మెల్యే వివేకానంద్‌కు సన్మానం



కుత్బుల్లాపూర్: రానున్న రోజుల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పరుస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల ప్రజలు ఎమ్మెల్యేను పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించిన ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ.. గత తొమ్మిదేళ్ల కాలంలో కోట్లాది నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టామని, రాబోయే రోజుల్లో ఇదే తరహాలో కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు.

కార్మికురాలికి రూ.4.5లక్షల నష్టపరిహారం అందజేత



బాధితురాలికి చెక్కును అందజేస్తున్న మదన్‌గౌడ్

జీడిమెట్ల: పరిశ్రమలో ప్రమాదవశాత్తు చేయి పోగొట్టుకున్న కార్మికురాలికి కార్మిక నాయకులు ముద్దాపురం మదన్‌గౌడ్ కలుగజేసుకుని నష్టపరిహారం ఇప్పించారు. రాజీవ్‌గాంధీనగర్‌లోని యాక్సిస్ పరిశ్రమలో ఉమా అనే కార్మికురాలు పనిచేస్తోంది. కాగా డిసెంబర్ 5వ తేదీన ఉమా పరిశ్రమలోని పనిచేస్తుండగా కుడి చేయి తెగి కిందపడిపోయింది. విషయం తెలుసుకున్న మదన్‌గౌడ్ పరిశ్రమ ఎండీ శవర్‌రతిన్‌తో మాట్లాడి శనివారం బాధితురాలికి రూ.4.5లక్షల నష్టపరిహారంతో పాటు 3నెలల జీతం ఇప్పించారు.

కుత్బుల్లాపూర్‌లో కాంగ్రెస్ బలోపేతానికి కృషి

సుభాష్‌నగర్: గాంధీభవన్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ జనరల్ బాడీ మీటింగ్ జరిగింది. ఈ కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా డీసీసీ మహిళా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మితో కలిసి కుత్బుల్లాపూర్ బి.బ్లాక్ అధ్యక్షురాలు సొంటిరెడ్డి చైత్యన్యారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టబోయే కార్యక్రమాలపై చర్చించారు. కుత్బుల్లాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి త్వరలో కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగనున్నామని తెలిపారు.

స్త్రీట్ కాజ్ ఏర్పాటు చేసింది డిజిటల్ క్లాస్



కుత్బుల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ తరగతిని అందుబాటులోకి తెచ్చిన స్ట్రీట్ కాజ్ విద్యార్థుల బృందం

కుత్బుల్లాపూర్: విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించారు. అనుకున్నదే తడువుగా ఆ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు.

కుత్బుల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో డిజిటల్ తరగతి లేదన్న విషయం గుర్తించిన ఎంఆర్‌ఐటీఎస్ కళాశాలలోని స్ట్రీట్ కాజ్ విద్యార్థుల బృందం రూ.60వేల తమ సొంత డబ్బులను వెచ్చించి ఒక్క ప్రొజెక్టర్, కీబోర్డ్ , మౌస్, స్క్రీన్, మానిటర్ కొనుగోలు చేసి ఒక డిజిటల్ తరగతి ఏర్పాటు చేశారు. దీంతో 1200 పైచీలుకు విద్యార్థులకు ఈ డిజిటల్ తరగతి ఉపయోగపడనుంది. శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కమల్‌సింగ్ స్ట్రీట్ కాజ్ బృందాన్ని అభినందించారు. ఎటువంటి సమస్యలు ఏమైన తమ దృష్టికి వస్తే వాటిని పరిష్కంచడానికి తాము ముందుంటామని స్ట్రీట్ కాజ్ విద్యార్థుల బృందం తెలిపింది.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సన్మానం



పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న గడ్డమీది భరత్‌గౌడ్

జగద్గిరిగుట్ట: నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, డాక్టర్ ఎన్టీఆర్ ఆడిటోరియంలో శనివారం పీసీసీ కల్లుగీత డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో టీపీసీసీ కల్లుగీత రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర జాయింట్ కోఆర్డినేటర్, ఓబీసీ డిపార్ట్‌మెంట్ గడ్డమీది భరత్‌గౌడ్, కల్లుగీత డిపార్ట్‌మెంట్ నాయకులు, కాంగెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మల్కాజ్‌గిరి ఎంపీ సీటుపై 'కూన' కన్ను

- ఇప్పటికే బీజేపీ అధిష్టానానికి సంకేతాలు పంపిన కూన శ్రీశైలంగౌడ్
- ఏడు నియోజకవర్గాల పరిధిలోని నేతలతో చర్చించిన కూన



కుత్బుల్లాపూర్: 2024 మార్చిలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ సన్నద్ధమవుతోంది. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో మొత్తం 7 నియోజకవర్గాలు ఉన్నాయి. అందులో మొత్తం నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు గెలిచిన విషయం తెలిసిందే. కాగా 2024 మార్చిలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తీర్పు భిన్నంగా ఉంటుందని కచ్చితంగా ప్రజలు బీజేపీకి జై కొడతారని నాయకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో బీజేపీ తరపున పోటీ చేసేందుకు పలువురు నాయకులు ఉత్సాహపడుతున్నారు.

- 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ నుంచి పోటీ చేసిన ప్రస్తుత ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి విజయం సాధించిన విషయం తెలిసిందే. 2024 మార్చి నెలలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ తరపున తాను పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఇప్పటికే కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ పార్టీ అధిష్టానానికి సంకేతాలు పంపించారు.
- కాగా ఇదే స్థానం నుంచి పోటీ చేసేందుకు బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావు సైతం సిద్ధంగా ఉన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ బీజేపీ అభ్యర్థిగా పోటీచేసిన కూన శ్రీశైలం లక్షకు పైగా ఓట్లు సాధించి జోష్‌లో ఉన్నారు. ఇప్పటికే మల్కాజిగిరి, కంటోన్మెంట్, ఉప్పల్, కుత్బుల్లాపూర్, మేడ్చల్, కూకట్‌పల్లి, ఎల్బీనగర్ బీజేపీ నాయకులతో కలిసి కూన ఇదే విషయాన్ని చర్చించినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా పార్లమెంట్ ఎన్నికల్లో తాను బరిలో దిగేందుకు సిద్ధంగా ఉన్నానని కూన బహిరంగంగానే చెబుతున్నారు.

కొంత సమయాన్ని పిల్లలకు కేటాయించాలి



మాట్లాడుతున్న నవలా రచయిత యండమూరి వీరేంద్రనాథ్

సుభాష్‌నగర్: విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని ప్రముఖ నవలా రచయిత యండమూరి వీరేంద్రనాథ్ అన్నారు. శనివారం సూరారంలోని ఐరీష్ ఫ్లోరెట్స్ వరల్డ్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై తల్లిదండ్రులకు పిల్లల పెంపకంపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వీరేంద్రనాథ్ మాట్లాడుతూ.. నేటి బిజీ ప్రపంచంలో తల్లిదండ్రులు ప్రతిరోజు కొంత సమయాన్ని పిల్లలతో గడిపేందుకు కేటాయించాలన్నారు. అప్పుడే వారికి దగ్గరయ్యే అకాశముందన్నారు. స్కూల్‌లో మొదలుకుని బయట జరిగే పలు విషయాలను పిల్లలు తల్లిదండ్రులకు చెబుతారని.. వారికి సరైన మార్గనిర్దేశనం చేసి సన్మార్గంలో పెట్టేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ తూర్లపాటి శిరీష్, రాధిక, తూర్లపాటి, డైరెక్టర్ వినయ్‌కుమార్, ప్రిన్సిపాల్ తులసినంద, హెడ్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పైప్‌లైన్ పనులు చేపట్టాలి

వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డి



మహదేవపురంలో పర్యటిస్తున్న జలమండలి జీఎం శ్రీధర్‌రెడ్డి అధికారులు

చింతల్: గాజులరామారావు సెక్షన్ పరిధిలోని మహదేవపురంలో త్వరలో ప్రారంభం కానున్న 600 ఎంఎం భారీ పైప్‌లైన్ విస్తరణ పనులను శనివారం కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్ రెడ్డి పరిశీలించారు. సుమారు 400 మీటర్ల మేర చేపట్టనున్న ఈ పైపులైన్ పనులను త్వరలోనే ప్రారంభిస్తున్నామని తెలిపారు. పైప్ లైన్ విస్తరణకు అడ్డంకిగా కొన్ని దుకాణ సముదాయాలు ఉన్నాయని వాటిని యజమానులు ముందస్తుగా అక్కడ నుంచి తొలగించే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మాదాపురంలో రోడ్డుకు అనుకొని 600 ఏఎం పైప్‌లైన్ ఉన్నందున కొంత ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే అవకాశముందన్నారు. పలు హోటల్ నిర్వాహకులు, దుకాణదారులు రోడ్డు మీదకు ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించాలన్నారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలతో పైప్‌లైన్ పనులు చేపట్టాలని సూచించారు. జీఎం వెంట షాపూర్‌నగర్ సబ్ డివిజన్ డీజీఎం అప్పలనాయుడు, సెక్షన్ మేనేజర్ రోహిణి, కాంట్రాక్టర్ లు ఉన్నారు.

ఘనంగా స్పోర్ట్స్ డే వేడుకలు



నిజాంపేట్: ప్రగతినగర్ జగన్ స్టూడియోలో శనివారం ఐరీస్ ఫ్లోరెట్స్ ప్లేస్కూల్ స్పోర్ట్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. కార్పొరేటర్ చిట్ల దివాకర్, డాక్టర్ శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరై స్పోర్ట్స్‌మీట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ శరత్‌రెడ్డితో కలిసి పతకాలు, ప్రశంస పత్రాలు అందజేశారు. విద్యతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమని, మానసిక, శరీర ధృడత్వం కోసం ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొనాలని కోరారు.

వీధికుక్కల బారి నుంచి కాపాడాలి



నిజాంపేట్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న భిక్షపతి యాదవ్ తదితరులు

నిజాంపేట్: వీధి కుక్కల బారి నుంచి చిన్నారులను కాపాడాలని భిక్షపతియాదవ్ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం బండారి లేఅవుట్‌లోని పార్క్ సమీపంలో ఇద్దరు చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయన్నారు. వీధి కుక్కలను నియంత్రించడానికి ప్రతిఏటా లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా అవి అమలుకు నోచుకోవడం లేదని మండి పడ్డారు. ఏబీసీ/ఏఆర్‌వీ ప్రోగ్రామ్ కింద ప్రతి వీధి కుక్కకు రూ.1600 వెచ్చిస్తున్నారని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిదుల నిర్లక్ష్యంతో చిన్నారులు వీధి కుక్కల దాడికి గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా స్పందించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలను తరలించాలని కోరగా కమిషనర్ సానుకూలంగా స్పందించారు. ప్రొఫెసర్ చంద్రమౌళి, సచిన్ మాలిక్, శివ యాదవ్ ,ప్రసాద్ ,చందు తదితరులు ఉన్నారు.

సందడిగా ఫ్రెషర్స్ డే

చింతల్ భాగ్యరథి జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే శనివారం గాంధీనగర్‌లోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన క్యాట్ వాక్, ఫ్యాషన్ షో తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు స్వాగతం పలుకుతూ పలు సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల అధినేత వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఫ్రెషర్స్‌డే వేడుకలు ఆద్యంతం సందడిగా జరిగాయి. - రంగారెడ్డినగర్



ప్రతిభ చాటిన విద్యార్థులకు మెమోంటోలు అందజేస్తున్న అధ్యాపకులు



విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ



సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేస్తున్న వినియోగదారులు

కుత్బుల్లాపూర్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. కుత్బుల్లాపూర్ సబ్ డివిజన్ వద్ద శనివారం ఉదయం 10: 30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఏర్పాటు చేసిన 'సమస్యల పరిష్కార వేదిక'కు విశేష స్పందన లభించింది. సుమారు 15 ఫిర్యాదులు రాగా వాటిని అక్కడికక్కడే పరిష్కరిస్తూ ముందుకు సాగారు. టెక్నికల్, ఫైనాన్స్, కన్స్యూమర్ అఫైర్స్ చైర్‌పర్సన్లు హాజరైన ఈ కార్యక్రమంలో మేడ్చల్ డీఈ శ్రీనాథ్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ ఏడీఈ సత్యనారాయణ పర్యవేక్షణలో ఫిర్యాదులను పరిష్కరించారు.

కుత్బుల్లాపూర్, పేట్‌బషీరాబాద్, గాజులరామారం, కొంపల్లి ప్రాంతాల నుంచి పలువురు వచ్చి ఫిర్యాదులు చేశారు. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాల విషయంపై, హెచ్చుతగ్గుల సమస్యలు, విద్యుత్ మీటర్ల ఏర్పాటు వంటి విషయాలతో పాటు దీర్ఘకాలంగా ఉన్న పలు సమస్యలను పరిష్కరిస్తూ వినియోగదారులకు భరోసా కల్పించారు. వివిధ సెక్షన్ల ఇంజినీర్లు చైతన్య, జ్ఞానేష్, రవీందర్, వినాయక్ రాథోడ్ తదితరులు ఉన్నారు.